

అధికారులకు సూచనలు చేస్తున్న వరంగల్ కలెక్టర్, ఆర్వో ప్రావీణ్య

తొలి అంకం ప్రారంభం..

మొదలైన 'లోక్‌సభ' నామినేషన్ల పర్వం

- తొలి రోజు వరంగల్‌కు ముగ్గురు, మానుకోటకు ఒకరు దాఖలు
- రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి తొలిఅంకం ప్రారంభమైంది. గురువారం అధికారులు నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో.. నామినేషన్ల దాఖలు ప్రక్రియ షురూ అయ్యింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ (మానుకోట) స్థానాలకు సంబంధించి తొలిరోజు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో వరంగల్ నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు, మానుకోటలో ఒకరు తమ నామపత్రాలను అందజేశారు. వరంగల్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, మానుకోటలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు వరంగల్‌లో అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు బుద్ధయ్య, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ ఒక సెట్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థినిగా తౌటపల్లి నర్మద ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇక మహబూబాబాద్ స్వతంత్ర అభ్యర్థిగా మరిపెడ మండలం ఎడ్జర్ల శివారు గుర్రపు తండాకు చెందిన బానోత్ లింగ్యానాయక్ తొలి నామినేషన్ వేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగగా.. రెండు నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. ఆయా పార్టీల అభ్యర్థులు ముహూర్త బలాలు చూసుకుంటున్నారని, 19, 22, 24 తేదీల్లో దాఖలు చేయనున్నట్లు సమాచారం. నామినేషన్ల స్వీకరణకు గాను వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్‌లలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం సమీపంలో 144సెక్షన్ అమలు చేశారు. వరంగల్‌లో నామినేషన్ల స్వీకరణకు ముందు ఏర్పాట్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు తగు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లు జగరకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నేతృత్వంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవోలు ఆలివేలు, నర్సింహారావులు ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఆట మొదలైంది

'లోక్‌సభ' పోరులో గెలుపే లక్ష్యంగా పార్టీల వ్యూహాలు

- శ్రేణులు, నాయకుల సమన్వయంపై కాంగ్రెస్ ఫోకస్
- నేడు మహబూబాబాద్‌లో, 24న వరంగల్‌లో సీఎం రేవంత్ సభలు
- బూత్ స్థాయి కేడర్‌పై బీజేపీ దృష్టి
- కంచుకోటను కాపాడుకునే ప్రయత్నంలో గులాబీ పార్టీ
- నియోజకవర్గాల బాధ్యతలు ఎమ్మెల్సీలు, సీనియర్లకు..
- ఓరుగల్లుపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల గురి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

నామినేషన్ల పర్వం మొదలైంది. పార్టీలు సమరానికి సై అంటున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార పర్వంలోకి దిగడంతో పాటు ఓ వైపు కేడర్‌ను కలుస్తూ.. మరోవైపు ప్రజల్లోకి వెళ్తూ గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ క్రమంలోనే ఆయా పార్టీల అధినాయకత్వాలు కూడా తమ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలకు పదను పెడుతున్నాయి. లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు ప్రత్యర్థి పార్టీల నుంచి శ్రేణుల చేరికల పై దృష్టి సారిస్తున్నాయి. రాష్ట్ర, జాతీయ నాయకులతో రోడ్ షోలు బహిరంగ సభలకు పార్టీలు ప్లాన్ చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

కేడర్‌లోకి హస్తం నేతలు

ఉమ్మడి వరంగల్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టిన కాంగ్రెస్.. బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో పాగా వేసేందుకు వ్యూహరచన చేస్తోంది. 2014 నుంచి తమ చేతికి చిక్కని ఓరుగల్లులో పాగా వేయాలని ప్రణాళిక రచిస్తోంది. వరంగల్ లోక్‌సభ స్థానాన్ని గులాబీ పార్టీ నుంచి చేజిక్కించుకునేందుకు వలసలపై దృష్టి పెట్టింది. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులతో పాటు 20మందికి పైగా కార్పొరేటర్లు, ముగ్గురు మున్సిపల్ చైర్మన్లను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. అంతేగాకుండా స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకుని ఆయన కుమార్తె కడియం కావ్యకు ఎంపీ టికెట్ ఇచ్చింది. దీంతో కడియం శ్రీహరి తన కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముఖ్య నాయకులను కలిసి తమ గెలుపునకు సహకరించాలని కోరుతూనే నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు కొత్త అయిన కడియం కావ్యను కేడర్‌లోకి తీసుకెళ్తూ జోష్ నింపుతున్నారు. కావ్య ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయడంతో పాటు సాయంత్రం 4గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే మడికొండ బహిరంగ సభ ద్వారా సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేస్తున్న బలరాంనాయక్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇప్పటికే లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించిన బలరాం నాయక్.. శుక్రవారం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటుండటంతో శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు బలరాంనాయక్ ప్రయత్నిస్తున్నారు. అలాగే పార్టీ అధిష్ఠాం వరంగల్, మహబూబాబాద్ పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు కో ఆర్డినేటర్లను నియమించింది. ఎప్పటికప్పుడు కో ఆర్డినేటర్లు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతూ సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

కేడర్‌పై బీజేపీ నజర్

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలపై బీజేపీ నజర్ పెట్టింది. 1984లో తొలిసారి బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి అప్పటి హనుమకొండ స్థానం నుంచి విజయం సాధించారు. అప్పటి నుంచి పోటీ చేస్తున్న బీజేపీకి వరంగల్ సీటు అందని ద్రాక్షలా మారింది. అయితే 40ఏళ్లకు బీజేపీకి వరంగల్‌లో గెలుస్తామన్న ధీమాతో ఎన్నికల బరిలో దిగుతోంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ ఇచ్చింది. మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్ని నియోజకవర్గాల్లో ప్రచారానికి తిరుగుతున్నారు. ఈ రెండు చోట్ల బీజేపీకి ఉన్న సంస్థాగత బలంతో పాటు మోదీ గాలిలో విజయం సాధిస్తామన్న ధీమాతో ఆ పార్టీ ఉంది. దీంతో బూత్ స్థాయి కేడర్‌పై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రముఖులను నియమించింది. పార్టీలోని కీలక నేతలు ఐక్యతతో పని చేస్తుండటంతో పాటు అనుబంధ సంఘాలు చాపకింద నీరులా విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే వరంగల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాలు నిర్వహించి పార్టీ అభ్యర్థిని పరిచయం చేస్తూ ఈసారి వరంగల్‌లో

మిగతా 7వ పేజీలో..





మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నేడు మానుకోటకు సీఎం

- 'జనజాతర' సభకు రానున్న రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రిగా తొలిసారి రాక
- ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల పర్యవేక్షణలో ఏర్పాట్లు, జనసమీకరణ
- సిద్ధమైన మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం

మహబూబాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. అదే దూకుడుతో పార్లమెంట్ స్థానాలను హస్తగతం చేసుకునేందుకు పార్లమెంటు పోరుకు కాలుదువ్వుతోంది. ఈ క్రమంలో తొలి ఎన్నికల ప్రచార సభకు ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డినే రంగంలో దింపుతోంది. నోటిఫికేషన్ విడుదలవడం, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో.. రెండోరోజు శుక్రవారం ముహూర్తం ఖరారు చేసుకున్న మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తన నామినేషన్ దాఖలు అనంతరం ఈ ఎన్నికల ప్రచారసభను నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మహబూబాబాద్‌కు చేరుకొని, తర్వాత జనజాతర బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఇందుకోసం పార్టీ జిల్లా నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

సెంటిమెంట్‌గా మానుకోట..

మహబూబాబాద్ పార్లమెంట్ ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గ ఆవిర్భావ

మిగతా 7వ పేజీలో..

వివరాలు 7లో..

బిడ్డపై ఆరాటమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదు..



- ఉద్యకారులను జైలులో వేసిన ఘనత కడియం శ్రీహరిది..
- రాజీనామా చేయకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడు..
- బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

అరూరి రమేశ్ చిన్న మెదడు చితికింది..



- రాజకీయాలను అడ్డం పెట్టుకొని భూకబ్జాలకు పాల్పడ్డాడు..
- ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు తీసుకొస్తా..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- వర్ధన్నపేటలో వరంగల్ లోక్‌సభ సన్నాహక సమావేశం

జిల్లాలో గాలిదుమారం

- మట్టేవాడలో ఇంటిపై కూలిన చింతచెట్టు
- మానుకోటలో కొబ్బరిచెట్టుపై పడిన పిడుగు



మట్టేవాడలో సమ్మక్క ఇంటిపై కూలిన చింతచెట్టు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 18 : జిల్లాలోని గూడూరు, మహబూబాబాద్, కేసముద్రం మండలాల్లో గాలిదుమారం వీచింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు భగ్గుమనగా 3 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మబ్బులు దట్టంగా కమ్ముకుని బలమైన గాలులు వీచాయి.

గూడూరు మండలంలోని మట్టేవాడలో కొద్దిపాటి జల్లులతో పాటు గాలిదుమారం బీభత్సానికి ఓ చింతచెట్టు తాటి సమ్మక్క ఇంటిపై కూలిపోయింది. దీంతో పైకప్పు పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. మహబూబాబాద్‌లోని గుమ్ముడూరు శివారులోని రెడ్యానాయక్ కాలనీలో దరిపెల్లి కృష్ణమూర్తి ఇంటి వెనుకాల ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది. కేసముద్రం మండలంలో కూడా బలమైనగాలులు వీచాయి. అర్పనపల్లిలో చిరుజల్లులు కురిశాయి. బయ్యారం, డోర్నకల్ మండలాల్లో మబ్బులు కమ్ముకున్నాయి. మిగతా గ్రామాల్లో ఎండలు దంచికొడుతున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖాతా తెరవదు

- త్వరలో ఆ పార్టీ దుకాణం బంద్
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



బయ్యారం, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖాతా తెరువదని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని, త్వరలోనే బీఆర్ఎస్ దుకాణం బంద్ కానుందన్నారు. బయ్యారంలో గురువారం జరిగిన కాంగ్రెస్ బూత్‌స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ ప్రాంత ఎమ్మెల్యే కోరం కనకయ్యను గెలిపించినట్టే, పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే.. పాలేరులాగా పనిచేస్తారన్నారు. బయ్యారం పెద్దచెరువు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల విజయంతో రాష్ట్రంలో ఎలాగైతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో.. ఎంపీ అభ్యర్థుల విజయంతో కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. మానుకోటలో శుక్రవారం జరిగే జనజాతర బహిరంగ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభకు బయ్యారం, గార్ల మండలాల నుంచి సుమారు 20 వేల మందిని తరలించేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్, పార్లమెంట్ ఎన్నికల ఇల్లందుఇన్‌చార్జ్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, పీసీసి సభ్యుడుపుచ్చకాయ వీరభద్రం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, బయ్యారం సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ కవితకు బీఫాం

- అందజేసిన అధినేత కేసీఆర్



కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న మాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత గురువారం బీఫాంను అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కవితకు అందచేశారు. ఈ సందర్భంగా ఆమెను పార్లమెంట్ అభ్యర్థిగా విజయం సాధించి రావాలని ఆయన ఆశీర్వదించారు. కవిత గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నియోజకవర్గ నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాత మధు, మహబూబాబాద్, ములుగు జడ్పీ చైర్‌పర్సన్‌లు అంగోతు బింధు, బడేటి నాగజ్యోతి, మానుకోట, డోర్నకల్, ఇల్లందు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, డీఎస్.రెడ్యానాయక్, హరిప్రియ, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాయకులు కుడితి మహేందర్‌రెడ్డి, కేఎస్ఎన్.రెడ్డి, అయూబ్ పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్ రైతులు జాగ్రత్త వహించాలి'



కురవిలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న మరియన్న

కురవి, ఏప్రిల్ 18 : ఆయిల్ పామ్ తోటల సంరక్షణలో రైతులు జాగ్రత్తలు వహించాలని జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి మరియన్న సూచించారు. మండలంలో పలు గ్రామాల్లో కురవి తోటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి యాజమాన్యం బిందుసేద్యం ద్వారా ఎరువులు ఇవ్వడం, మల్చింగ్, అంతర్‌పంటల సాగు, ఎలుకల నుంచి కాపాడుకోవడం, అబ్లేషన్ పాటించడం వంటి సూచనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫీల్డ్ అధికారి నాగరాజు, బిందుసేద్య ప్రతినిధి ఆగస్టిన్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా ఉమాకాంత ధ్రుపాటి



ఉమాకాంత ధ్రుపాటికి మొక్కను అందిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికలవ్యయ పరిశీలకుడు ఉమాకాంత ధ్రుపాటి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. లోక్‌సభ ఎలక్షన్స్ నేపథ్యంలో అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చులను పరిశీలించేందుకు ఆయనను ఎన్నికల వ్యయపరిశీలకుడిగా నియమించారు. ఆయన జిల్లాకు చేరుకోగా పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఉమాకాంత ధ్రుపాటిని గురువారం జిల్లా కలెక్టర్, పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు మొక్కను అందజేసి, స్వాగతించారు.

డ్రోన్ కెమెరాలకు అనుమతి లేదు

ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్

మహబూబాబాద్‌రూరల్, ఏప్రిల్ 18: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభ సమీపంలో డ్రోన్ కెమెరాలకు అనుమతి లేదని ఎస్పీసుధీర్ రామ్‌నాథ్‌కేకన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భాషబోయిన సంతోష్ అన్నారు. గురువారం హనుమ కొండలోని కేడీసీలో మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనం తరం సంతోష్ మాట్లాడుతూ... మోడల్ పరీక్షల వల్ల విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి వాటి పట్ల అవగాహన కలుగుతుందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్లో ఎప్‌సెట్, నీట్ కోచింగ్‌లను ఏర్పాటు చేయా లన్నారు.అకాడమీ లు, ప్రైవే టు జూనియర్ కళాశాలలు కోచింగ్‌ల పేరిట విద్యార్థుల నుంచి రూ.లక్షలు వసూల్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, జి. సుజాత, ఎ.అవినాష్, చిట్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేడీసీలో మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కలెక్టరేట్ నుంచే పర్యవేక్షణ

● కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నంబర్ల ఏర్పాటు ● 24 గంటలు అందుబాటులో సిబ్బంది

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18: జిల్లాలో ఎన్నికల పర్యవేక్షణ అంతా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే సాగుతోంది. అధికార యంత్రాంగం అంతా ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నారు. జిల్లాలో ఏ మూలకు ఏం జరిగినా ఇట్టే పసిగట్టి తగిన చర్యలు తీసుకునేందుకు కట్టుదిట్టమై ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని ఇప్పటికే కలెక్టర్ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రతీ ఒక్కరిని జాగు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో నాయకులు ప్రచారంపై దృష్టి సారించారు. ఈ సమయంలో పౌరులతోపాటు నాయకులకు పలు సందేహాలు వస్తుంటా యి. ఎన్నికల ప్రవర్తన నియమావళి, అతిక్రమణలపై ఫిర్యాదు చేసేందుకు ఎవరికి సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతుంటారు. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం సందేహాల నివృత్తి, ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టింది. ఓటరు జాబితాలో తమ పేరు ఉందా లేదో తెలుసుకోవాలన్నా, సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు గురి చేసినా, ఓట్లు దండుకోవడానికి డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నా, ప్రచార సమయంలో గొడవలు తలెత్తే అవకాశం ఉన్నా టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలిస్తారు. అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎలాంటి ఫిర్యాదులైనా టోల్ ఫ్రీ నెంబర్ 1950కు ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించారు.



సి విజిల్‌పై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన బ్యానర్

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో అధికారులు టోల్‌ఫ్రీ నెంబరు అందుబాటులోకి తెచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఎక్కువశాతం ఓటర్ల జాబితాకు సంబంధించి ఫిర్యాదులను వస్తున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే రాజకీయ పార్టీల నాయకులు ఒకరిని మించి మరొకరు ఎత్తుగడలు వేసే అవకాశం ఉంది. అప్పటి నుంచి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకోవడం షరా మామూలే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమణ, మద్యం, నగదుతోపాటు వివిధ రకాల బహుమతులు, కానుకలు అందించే అవకాశాలు ఉంటాయి. దీంతో ఫిర్యాదులు సైతం పెరుగుతాయి. ప్రచార సందర్భాల్లో గొడవలు, దాడులు చోటు చేసుకునే సందర్భాల్లో ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో టోల్ ఫ్రీ నెంబరు 1950కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

24 గంటలు అందుబాటులో

ఎన్నికల సమయంలో ఫిర్యాదులను స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. అధికారులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. ఏ సమయంలోనైనా ఫిర్యాదు స్వీకరించేందుకు సిద్ధంగా ఉంటున్నారు. కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నెంబర్ 1950, జిల్లా సమాచార కేంద్రం నెంబర్ 0870-2530811, వాట్సాప్ నెంబర్ 91542 52936లకు ఫిర్యాదు చేస్తే సకాలంలో చర్యలు తీసుకోనున్నారు. వచ్చిన ప్రతీ ఫిర్యాదును నమోదు చేయడం జరుగుతుంది. ఫిర్యాదు చేసి వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు, అడ్రస్‌తోపాటు వారి వచ్చిన సందేహం, ఫిర్యాదును నమోదు చేసుకుంటారు.

సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు..

ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లోనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు చేరుతుంది. అక్కడ నుంచి ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు చేరుతుంది. వారు 15 నిమిషాల్లో క్షేత్రస్థాయి విచారణ చేస్తారు. ఆ నివేదిక 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి వెళ్లేలా ఏర్పాటు చేశారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై 100 నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని అధికారులు తెలుపుతున్నారు. లైవ్ ఫొటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌లో ఉంచడంతో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా ఆటోమెటిగ్గా లోకేషన్ నమోదు అవుతుంది. అక్రమంగా మద్యం, డబ్బులు, బహుమతుల పంపిణీ, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన లైవ్ ఫొటోలు, వీడియోలతో సి-విజిల్ యాప్ ద్వారా పంపవచ్చు. సి-విజిల్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.


మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

మీడియా సెంటర్ ఏర్పాటు

శాసనసభ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించేందుకు కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచారం వ్యయంలో లెక్కించడం జరుగుతుంది. వార్త పత్రికలు, ఈ పేపర్‌లు, టెలివిజన్ చానల్స్, స్థానిక కేబుల్ నెట్‌వర్క్స్, సోషల్ మీడియా, ఎస్ఎంఎస్‌లు ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుంది. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకం కావడంతో మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు.

ఇంటి నుంచే నామినేషన్లు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 18: ఎన్నికల ప్రక్రియలో రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం తోడవుతోంది. ఇంటి వద్ద నుంచే సులువుగా ఓటు నమోదు చేసుకోవడం, చిరునామా మార్పు, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవడం, ఎన్నికల నిబంధనల ఉలంఘన జరుగుతుంటే వాటిపై ఫిర్యాదులు చేయడం లాంటి వెసులుబా టు ఉంది. ఇక ప్రస్తుతం నామినేషన్లను ఇళ్ల వద్ద నుంచే దాఖలు చేసే అవకాశం కూడా ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఎన్నికల రిటర్నింగ్ కేంద్రాలకు వెళ్లకుండానే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు దాఖలు చేసేందుకు ప్రత్యేక యాప్‌లను సిద్ధం చేసింది. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు మద్దతుదారులతో కలిసి ర్యాలీగా వెళ్లడం, ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకోవడం లాంటి ఖర్చుతో కూడుకున్న వాటిని తగ్గించేందుకు ప్రత్యేకంగా సువిధ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది.



సువిధ యాప్

దాఖలు ఇలా...

గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25 వరకు కొనసాగనుంది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలనుకునే వారు వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్లకు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో కొందరికి దూరం భారంగా మారుతోంది. అలాంటివారు సువిధ యాప్‌లో నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు. అయితే ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఆస్తులు, అఫిడవిట్ పత్రాలు, బలపరిచే వారి వివరాలను నమోదు చేయాలి. వీటికి కావాల్సిన పత్రాలు అందజేసిన తర్వాత నిర్ణీత సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈపత్రాలతో జిల్లా ఎన్నికల అధికారిని కలిసి మూడు సెట్లను అందించాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు వాటికి అభ్యర్థులు అందుబాటులో లేకుంటే వారి మద్దతు దారులు హాజరుకావాల్సి ఉంటుంది. వివరాలు తప్పుగా ఉంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. ఆన్‌లైన్ అవకాశాన్ని వినియోగించుకుంటే అభ్యర్థులకు కొంత సమయం, డబ్బు ఆదా అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇక అనుమతులు సులువు

ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశం నిర్వహించాలంటే ఇదివరకు తెల్లకాగితంపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు సమయం దొరికినప్పుడు అనుమతులిచ్చేవారు. ఇది తలనొప్పిగా ఉండేది. ఇప్పుడు సులువుగా మారింది. ఇందు కోసం ఎన్నకల సంఘం సువిధ యాప్‌ను ప్రవేశపెట్టింది. అనుమతుల జారీ కోసం అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. యాప్‌లో దరఖాస్తు చేస్తే అనుమతులు జారీ చేస్తారు.

అనుమతులు తప్పనిసరి

నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఇక ఎన్నికల ప్రచా రం జోరుగా సాగనుంది. ప్రధాన పార్టీలు సభలు, సమా వేశాలపై దృష్టి సారిస్తాయి. ర్యాలీలతో హోరెత్తిస్తారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ఎన్నికల సంఘం ప్రచార పర్వంలో నిబంధనలు విధించింది. అభ్యర్థులు ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్న ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇందుకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

48 గంటల్లోనే ప్రచార అనుమతులు

- చరవాణి గూగుల్ ప్లేస్టోర్ ద్వారా సువిధ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- సమావేశం నిర్వహించే వివరాలతో పాటు తమకు ఏ విధమైన అనుమతులు కావాలో అందులో నమోదు చేయాలి.
- అనుమతులకు సంబంధించి మీ సేవా కేంద్రంలో చలానా చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించిన చలానా రసీదు సువిధలో నమోదు చేసిన వివరాలు రిటర్నింగ్ అధికారి, అసెంబ్లీ పరిధిలోని ఏఆర్వో కార్యాలయాల్లో అందజేయాలి.
- ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తులు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లో అనుమతులు జారీ చేస్తారు. అనుమతి జారీలో జాప్యం జరిగితే..సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.


వరంగల్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిని తౌటపల్లి నర్మద , అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థి అంబోజు బుద్దయ్య.

నామినేషన్ల పర్వం షురూ..

మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభం కాగా.. తొలిరోజున వరంగల్ నియోజకవర్గానికి ముగ్గురు, మాను కోటలో ఒకరు తమ నామినేషన్లను దాఖలు చేశారు. వరంగల్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, మానుకోటలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. వరంగల్‌లో అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా అంబోజు బుద్దయ్య, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థినిగా తౌటపల్లి నర్మద ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇక మహబూ బాబాద్ స్వతంత్ర అభ్యర్థిగా మరిపెడ మండలం ఎడ్జర్ల శివారు గుర్రప్ప తండాకు చెందిన బానోత్ లింగ్యానాయక్ తొలి నామినేషన్ వేశారు.



మహబూబాబాద్‌లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బానోత్ లింగ్యానాయక్

బిడ్డపై ఆరాటమే తప్పా.. ప్రజలపై ప్రేమ లేదు..

● ఉద్యకారులను జైలులో వేసిన ఘనత కడియం శ్రీహరిది.. ● బీజేపీ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

హనుమకొండ టౌన్, ఏప్రిల్18: బిడ్డపై ఆరాటమే తప్ప.. ఎమ్మెల్యేగా గెలిపించిన స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఎలాంటి ప్రేమ లేదని బీజేపీ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు మండిపడ్డారు. గురువారం హంటర్‌రోడ్డులోని బీజేపీ వరంగల్ లోక్‌సభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. బీజేపీ గెలిస్తే పెద్ద ప్రమాదం జరుగుతుందని రాజ్యాంగంపై అవగాహన లేకుండా కడియం పిచ్చికూతలు కూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం విద్యావేత్త అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తనకున్న అధికారంతో జిల్లా ఎస్పీలు, కమిషనర్‌లను హెచ్చరించి ఉద్యమకారులను జైల్లో పెట్టించాడని ఆరోపించారు. బీజేపీ దళిత ద్రోహి అని పదే పదే చెబుతున్న కడియంకు.. పరకాల నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా జైపాల్ మాదిగను నిలబెట్టింది బీజేపీనే అన్న విషయం మరువొద్దన్నారు. లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 77శాతం మంది ప్రాతినిధ్యం వహిస్తున్నా రనే విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. దొర కాళ్ల పటుకొని బీఆర్ఎస్‌లో చేరి తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన చరిత్ర శ్రీహరిది అని ధర్మారావు ధ్వజమెత్తారు. డబ్బులకు లాలూచీ పడి ప్రజాస్వామాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. పార్టీ మారినప్పటికీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడని అన్నారు. శ్రీరామ నవమిని దేశవ్యాప్తం గా కన్నులపండువగా నిర్వహించుకుంటే.. మూఢత్వం అం టూ కొంతమంది విమర్శలు చేస్తున్నారని, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్న వ్యక్తులను పాకిస్థాన్‌కు తరలించాలని ధర్మారావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ప్రభారీ మురళీ, బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, శ్రీధర్, రావు పద్మ, జైపాల్, కీర్తిరెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మారావు

భద్రకాళి సన్నిధిలో అరూరి పూజలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 18: చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయం లో వరంగల్ లోక్‌సభ బీజే పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరూరి రమేష్ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రచార పర్వం ప్రారంభం కావడంతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరూరి.. తన ప్రచార వాహనాలకు వాహన పూజ లు నిర్వహించారు. ప్రచార పర్వం ప్రారంభిస్తున్న నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి, మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో ప్రచారం నిమిత్తం పూజ తర్వాత వాహనాలు బయల్దేరి వెళ్లాయి.


ప్రచార వాహనాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు మానుకోటకు సీఎం


మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో సిద్ధమవుతున్న జనజాతర సభావేదిక


మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో పోలీస్ బందోబస్తు కోసం అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

(5వ పేజీ తరువాయి)

తొలి పార్లమెంట్ సభ్యుడిగా 2009లో గెలిచిన పోరిక బలరాంనాయక్ అప్పటి యూపీఏ ప్రభుత్వంలో కేంద్రసామాజిక న్యాయశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత తెలంగాణ ఆవిర్భావంతో ఉద్యమ పార్టీగా బరిలో దిగిన బీఆర్ఎస్ అభ్యర్థులపై రెండుసార్లు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మార్పుకోరిన తెలంగాణ ప్రజల ఓటరు నాడికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభంజనంలో మళ్లీ పార్లమెంట్ స్థానానికి పోటీ పడుతున్నారు. రేవంత్‌రెడ్డి సీఎం కాకముందు నుంచే పోరిక బలరాంనాయక్‌కు ఆత్మీయుడిగా కొనసాగారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే ఒకట్రెండు సభల్లో ఉదహరించారు. దీంతో పాటు సెంటిమెంట్‌గా అటు మహబూబ్‌నగర్ నుంచి ఇటు మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార జనజాతర సభలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకావడం, వ్యూహాత్మకంగానే ఈరెండు స్థానాలను ఎంచుకున్నారని భావిస్తున్నారు. ఇక ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పోలీస్ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మానుకోట పట్టణం ఎన్టీఆర్ స్టేడియంలోని సభాస్థలి, హెలిప్యాడ్, పోలీస్‌బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల..

సీఎం రేవంత్‌రెడ్డి సభ విజయవంతానికి రెండ్రోజులుగా మహబూబాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, మానుకోట పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వరరావు సభ ఏర్పాట్లను చూస్తున్నారు. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేసేం దుకు కసరత్తు పూర్తి చేశారు. మండుటెండల్లో నిర్వహిస్తున్న సభకు హాజరయ్యే వారికి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించడంతో పాటు నీడ కోసం షామియానాలు కూడా వేశారు. శ్రీరామనవమి సందర్భంగా మహబూబాబాద్ గాంధీపార్కులో జరిగిన ఉత్సవాలకు హాజరైన ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి కూడా తొలుత సీఎం సభ ప్రాంగణాన్ని పరిశీలించి వెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు అటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, తదితరులతో సమన్వయం చేసుకుంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశాలు నిర్వహించి సీఎం సభ విజయవంతానికి ఏర్పాట్లు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతుండడంతో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

అరూరికి చిన్న మెదడు చితికింది..

● రాజకీయాలను అడ్డం పెట్టుకుని భూ కబ్జాలకు పాల్పడ్డాడు.. ● ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందిస్తా..
● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ● వర్ధన్నపేటలో వరంగల్ లోకసభ సన్నాహక సమావేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 18: వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ చిన్న మెదడు చితికిందని, అందుకే మతి తప్పి మాట్లాడుతున్నాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎద్దేవా చేశారు. గురువారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని 'డీ' కన్వెన్షన్ హాలులో వర్ధన్నపేట వరంగల్ లోక్‌సభ ఎన్నిక సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీహరి మాట్లాడారు. తన తాత, తనతో పాటు కూతురు కడియం కావ్య పర్వతగిరిలోనే జన్మించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కొందరు వక్రీకరిస్తూ ఇష్టారాజ్యంగా మాట్లాడు తున్నారని అరూరి రమేశ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా రమేశ్‌కు బుద్ధి రాలేదన్నారు. కబ్జాదారులు, గుంటనక్క లాంటి నాయకులు అవసరమా? అని ప్రశ్నించారు. రమేశ్ వంటి దొంగలకు అవకాశం ఇస్తే దోపిడీ జరుగుతుందన్నారు. రాజకీయాల్లో సేవ చేసే దృక్పథం ఉండాలే కానీ.. దోచుకునే తత్వం ఉండరాదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదమని శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాదానికి అర్థమే మారిపోతుందన్నారు. దళితులకు రిజర్వేషన్లు రద్దు అవుతాయని చెప్పారు. బీజేపీ అరాచకాలకు అడ్డుపడాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని శ్రీహరి కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందించే బాధ్యత తనదని శ్రీహరి హామీ ఇచ్చారు. డాక్టరు కడియం కావ్యను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రమేశ్ భూ బకాసురుడు..

అరూరి రమేశ్ భూ బకాసుడని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య ఆరోపించారు. తొలి నుంచి కూడా తన జన్మస్థలం ఇతర వ్యక్తిగత విషయాలే తప్ప.. ఇంకేమీ చెప్పలేక రమేశ్ నానా తంటాలు పడుతున్నాడని అన్నారు. తన తండ్రి కడియం శ్రీహరి రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేదని, ఈ క్రమంలో అరూరి రమేశ్‌కు ఏమీ దొరకక అర్థం లేని విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. దొంగలకు అవకాశం ఇస్తే ఆగమైపోతారని ప్రజలకు సూచించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి దేశాన్ని భయందోళనలకు గురిచేస్తున్న బీజేపీని పాతాళానికి తొక్కి పెట్టాలన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచదేశాలకే దిక్సూచిగా నిలిచిందని అన్నారు. రాజ్యాంగ నిర్మాణ డాక్టరు బీఆర్ అంబేద్కర్ విశ్వవాప్తంగా కీర్తి పొందారన్నారు. కానీ బీజేపీ మాత్రం రాజ్యాంగాన్నే మారుస్తామని చెప్పడం అనైతికమన్నారు. ప్రజలు ఆలోచించాలని, దేశంలో శాంతి నెలకొనాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినీ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టరు రియాజ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

23న వరంగల్‌కు కేటీఆర్

● నియోజకవర్గాల వారీగా సమావేశాలు
● 22న సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు



రాంనగర్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ 23న వరంగల్ పర్యటనకు రానున్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపెల్లి సుధీర్‌కుమార్ ప్రచార కార్యక్రమానికి కేటీఆర్ హాజరుకానున్నారు. 23న సాయంత్రం 4గంటలకు వర్ధన్నపేటలో జరిగే సమావేశంలో పాల్గొననున్న కేటీఆర్.. సాయంత్ర 6గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. సుధీర్‌కుమార్ 22న ఉదయం 10గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

అలాగే ఏడు నియోజకవర్గాల వారిగా ప్రచార సమావేశాలను పార్టీ ప్రకటించింది. 19న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమావేశం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఉదయం 10గంటలకు జరగనుంది. 20న ఉదయం 10గంటలకు భూపాలపల్లి నియోజకవర్గ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తారు. 20న మధ్యాహ్నం 2గంటలకు పరకాల నియోజకవర్గ సమావేశం నియోజకవర్గ కేంద్రంలోని లలితా కన్వెన్షన్‌లో జరుగుతుంది. 23న సాయంత్రం 4గంటలకు వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశం నియోజకవర్గ కేంద్రంలో జరుగుతుంది. 23న సాయంత్రం 6గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశం వరంగల్‌లో నిర్వహించనున్నారు. 25న ఉదయం 10గంటలకు పాలకుర్తి నియోజకవర్గ సమావేశం రామ ఉపేందర్ గార్డెన్స్ తొర్రూరులో నిర్వహించనున్నారు.

ఆట మొదలైంది..

(5వ పేజీ తరువాయి)

పాగా వేయాలని కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నారు.

కంచుకోటపై గులాబీ గురి

పదేళ్లుగా బీఆర్ఎస్‌కు ఉమ్మడి వరంగల్ కంచుకోటలా ఉంది. ఏ ఎన్నికలు జరిగినా ఓరుగల్లులో ఆపార్టీదే హవా.. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ కేడర్‌లో కొంత నైరాశ్యం నెలకొంది. దీనికి తోడు వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైనా కడియం కావ్య కాంగ్రెస్‌లోకి జంప్ కావడం శ్రేణుల్లో మరింత నిరుత్సాహం నింపింది. అయితే ఏప్రిల్ 1న హనుమకొండలో జరిగిన వరంగల్ లోక్‌సభ స్థాయి సమావేశంలో నేతల ప్రసంగాలు వారిలో ఉత్సాహం నింపాయి. బీఆర్ఎస్‌కు కడియం శ్రీహరి ద్రోహం చేశారని రగిలిపోతున్న కేడర్ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుని ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌ను వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవితను అధిష్ఠానం ఖరారు చేయడంతో పాటు ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులను అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలుగా నియమించింది. ఇప్పటికే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించిన బీఆర్ఎస్ శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శ్రేణుల సమావేశం ఏర్పాటు చేసింది. అలాగే మిగతా అన్ని నియోజక వర్గాల్లో కార్యకర్తల సమావేశాలతో ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్‌కు దీటుగా ప్రచారం చేయాలని వ్యూహ రచన చేస్తున్నారు. మొత్తానికి నామినేషన్ల ఘటం మొదలు కావటంతో ఓరుగల్లులో రాజకీయాలు వేడెక్కబోతున్నాయి.

ఆర్టీసీ సిబ్బంది రోజూ రూ.లక్ష తీసుకురావాలి

ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత

న్యూశాయంపేట, ఏప్రిల్ 18: ఆర్టీసీలో నూతనంగా 'లక్షే లక్ష్యం' అనే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వరంగల్-1డిపోలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్ఎం శ్రీలత మాట్లాడుతూ.. రీజియన్ పరిధిలోని డిపోల సిబ్బంది ఇక నుంచి రోజుకు రూ.లక్ష ఆదాయాన్ని అదనంగా తీసుకురావాలన్నారు. డిపో 1 పరిధి పెద్దగా ఉన్నందున రోజుకు సిబ్బంది రూ.1,80,000 తీసుకురావాలన్నారు. సిబ్బంది సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో 1 మేనేజర్ వంగాల మోహన్‌రావు, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సంతోష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత

ఉత్తమ కళాశాలల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్18 : జిల్లాలో ఉత్తమ ప్రైవేటు జూనియర్ కళాశాలల ఎంపికకు ఈనెల 27 వరకు ఆసక్తిగల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజు గురువారం తెలిపారు. 2042-25 విద్యాసంవత్సరానికి కార్పోరేట్ కళాశాలల ప్రవేశ పథకంలో (ఇంటర్మీడియట్, ఎంసెట్ కోచింగ్) కోసం ఉత్తమ కళాశాలల ఎంపిక కోసం జిల్లాలోని ప్రైవేటు కళాశాలల నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్పొరేట్ కళాశాలలకు పథకంలోని భాగంగా విద్యార్థుల ఫీజు, బుక్స్, హాస్టల్ వసతి, భోజనవసతిగాను, ఇతర అవసరములకు ప్రతీ విద్యార్థికి రూ. 35 వేల చొప్పున చెల్లించబడునని తెలిపారు. పాకెట్ మనీ కోసం ప్రతీ విద్యార్థికి రూ.3వేల చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యాజమాన్యాలు epass.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల27 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్‌నెంబర్ : 98499 43887, 94401 20620లను సంప్రదించాలన్నారు.

నియంతలా వ్యవహరిస్తున్న ప్రధాని : సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

కేసముద్రం, ఏప్రిల్ 18 : ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రులను, మంత్రులను అరెస్టు చేయించి జైలుకు పంపుతూ మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక హరిహర గార్డెన్‌లో కేసముద్రం, నెల్లికుదురు మండలాల పార్టీ సర్వసభ్య సమావేశం మార్తినేని పాపారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. జిల్లాలో రెండోసారి గెలిస్తే ఉక్కు ఫ్యాక్టరీ తెస్తామని హామీ ఇచ్చి విస్మరించారని, ఓటుఅడిగే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు గునిగంటి రాజన్న, రెండు మండలాల కార్యదర్శులు మోడెం వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల తిలక్‌బాబు, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, చాగంటి కిషన్, వెల్పుగొండ సావిత్ర, కావటి నర్సయ్య, గొడిశాల వెంకన్న,ఈసంపల్లి సైదులు, పెరుమాండ్ల బాబుగౌడ్, నర్సయ్య, జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

రైలులో సాధారణ బోగీలు పెంచాలని ప్రధానికి ఉత్తరాలు

కేసముద్రం, ఏప్రిల్ 18 : ప్రతి రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని కోరుతూ.. ప్రధానమంత్రి కార్యాలయానికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని కేసముద్రంలో గురువారం ఆ సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సామల నర్సయ్య, పోకల శ్రీనివాస్, కొలిపాక వెంకన్న, మామిడాల శ్రీనివాస్, హసీంఆలీ, కృష్ణదాసన్, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, మంచన శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ పుస్తకాల పంపిణీ

కేసముద్రం, ఏప్రిల్ 18 : కేసముద్రం విలేజ్ హైస్కూల్లో గురువారం నేషన్స్ ఫస్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ (ఎన్ఎఫ్‌హెచ్‌సీ), ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పాలిటెక్నిక్ పుస్తకాలు పంపిణీ, ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ పరికిపండ్ల అశోక్, ఇస్లావత్ సుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు

పెద్దవంగర, ఏప్రిల్ 18 : మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన రావుల వెంకటరంగారెడ్డి సొంత ఖర్చులతో తనతండ్రి రావుల సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం క్రీడాకారులకు స్పోర్ట్ టీషర్ట్‌ను పంపిణీ చేశారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు యువతలో పోటీతత్వం, స్నేహభావం పెరుగుతుందన్నారు. గ్రామాల్లోని యువకులు సమాజ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్నక్రీడల్లో నైపుణ్యం పెంచుకొని రాణించాలని కోరారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే క్రీడల్లో రాణిస్తేనే ఉన్నత చదువుల్లో, క్రీడల్లో మంచిపునాది వేసినట్లు అవుతుందన్నారు. క్రీడాల్లో రాణించిన వారికి విద్య, ఉద్యోగాల్లో మెండుగా అవకాశాలు లభించి, బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, అవుల మహేష్, సోంమల్లు, రజినీకాంత్, యాకయ్య, రామ్‌చరణ్, ఉపేందర్, సుధీర్ పాల్గొన్నారు.

హుస్సేన్‌నాయక్ ప్రత్యేక పూజలు

కురవి, ఏప్రిల్18 : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. వీరభద్రస్వామి, భద్రకాళిఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు చీకటి మహేష్, మోదీన్, వెంకన్న, కొంతం పెంటయ్య, బుడిగే భద్రసేనగౌడ్, మండల అధ్యక్షుడు ఎస్పీఎన్ రాజు, పూర్ణచందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సినిమా నటీనటులు

యదార్థ సంఘటనల ఆధారంగా 'శరపంజరం'

హీరో, దర్శకుడు గట్టు నవీన్ కుమార్

తొర్రూరు, ఏప్రిల్ 18 : తెలంగాణలో గంగిరెద్దుల జీవన విధానం, జోగిని వ్యవస్థల ఆధారంగా రూపొందించిన యదార్థ సంఘటనల ఆధారంగా శుక్రవారం శరపంజరం సినిమా థియేటర్‌ల్లో విడుదల కానుందని, జీరో బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించాలని హీరో, దర్శకుడు గట్టు నవీన్‌కుమార్ కోరారు. గురువారం తొర్రూరులో జరిగిన సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 90 శాతం ఈ సినిమాను మహబూబాబాద్ జిల్లా పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించామని, స్థానికుల నుంచి గొప్ప సహకారం అందిందన్నారు. నిర్మాత గణపతిరెడ్డి మాట్లాడుతూ దృఢసంకల్పంతో నవీన్ ఈ చిత్రాన్ని నిర్మించాడని తెలిపారు. జబర్దస్త్ వెంకీ మాట్లాడుతూ ప్రపంచంలోనే తొలి జీరోబడ్జెట్ చిత్రం శరపంజరం అని తెలిపారు. హీరోయిన్ లయ, నటులు మల్లేశం, అలువాల సోమయ్య, కెమెరామెన్ మస్తాన్, మ్యాజిక్ కల్యాణ్, మ్యూజిక్ డైరెక్టర్ మల్లిక్ పాల్గొన్నారు.

సీఎం సభను సక్సెస్ చేయాలి

కేసముద్రం, ఏప్రిల్ 18 : మానుకోటలో శుక్రవారం జరిగే జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్ పిలుపునిచ్చారు. కేసముద్రం మండలంలో గురువారం ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్ నేడు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్న ఆయన సీఎం రేవంత్‌రెడ్డి హాజరైయ్యే సభకు కేసముద్రం మండలం నుంచి సుమారు 10 వేలు మంది జనం తరలివచ్చేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బండారు వెంకన్న, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు బండారు దయాకర్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలేపాక నాగరాజు, పట్టణ అధ్యక్షుడు రావుల మురళి, నవాజ్, అహ్మద్, యాకూబ్, వెంకటేశ్వర్లు, మల్లయ్య పాల్గొన్నారు.

ఇందిరా గాంధీది త్యాగాల కుటుంబం

- ఆగస్టు 15లోపే రూ. 2 లక్షల రుణమాఫీ
- రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మరిపెడ, ఏప్రిల్ 18 : ఇందిరా గాంధీది త్యాగాల కుటుంబమని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కొనియాడారు. గురువారం మరిపెడ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో డోర్నకల్ నియోజక వర్గస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అధ్యక్షతన జరుగగా, ఆయన హాజరై మాట్లాడారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15 లోపు రైతులకు తప్పక రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపచేస్తామన్నారు.ఎంపీగా బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే సీఎం సభకు భారీఎత్తున తరలిరావాలని కార్యకర్తలను కోరారు. అనంతరం మాజీమంత్రి సత్యవతి అనుచరులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్మినేని రవీందర్, నర్సింహులపేట పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, హాకా చైర్మన్ సోదరుడు మచ్చా వెంకటనర్సు, కురవి, డోర్నకల్, దంతాలపల్లి మండలాలకు చెందిన అనేకమంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి మంత్రి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

సంపన్నులకే మోదీ గ్యారెంటీ..

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

సంపన్నులకే మోదీ గ్యారెంటీ అని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. బలరాంనాయక్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలకు సులభం అవుతుందన్నారు. కొత్తపాత తేడాలేకుండా సమష్టిగా పని చేయాలని సూచించారు.

అభివృద్ధి చేశా.. గెలిపించండి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నూకల నరేశ్‌రెడ్డి, వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌రెడ్డి, గంధసిరి అంబరీష, కాలం రవీందర్‌రెడ్డి, అంబటి వీరభద్రం, తాజుద్దీన్, అఫ్జల్, అప్సర్ పాల్గొన్నారు.

ఎంపీగా సీతారాంనాయక్‌ను గెలిపించాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 18 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బలపరిచిన మానకోట ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ ముత్యాలమ్మ గుడిలో గురువారం ప్రచార రథాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీని ప్రధాన మంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన గెలుపుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళి, మాజీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, ముసుగు శ్రీనివాస్‌రెడ్డి, సింగారపు సతీష్, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, గడ్డం అశోక్, దార ఇందుభారతి, వెన్నమల్ల అజయ్, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, కొమ్మాల్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, వెన్నమల్ల సందీప్, పల్లె సందీప్, మారగాని రాజుగౌడ్, శివకృష్ణ, గౌతమ్ పాల్గొన్నారు.


ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద బీజేపీ ప్రచార రథాలకు పూజలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్‌రావు

'మోదీని మూడోసారి పీఎంను చేయాలి'

గూడూరు, ఏప్రిల్ 18 : మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేయాలంటే ఎంపీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు లింగాల సుధీర్‌రెడ్డి అన్నారు. గూడూరు మండల కేంద్రంలో పోలింగ్‌బూత్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి ముచ్చటగా ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా అజ్మీర సీతారాంనాయక్ బరిలో ఉన్నారని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచకొండ కొమురయ్య, జిల్లా నాయకులు మేరెడ్డి సురేందర్, మేరుగు మల్లయ్య, పడల నాగరాజు, బత్తుల లక్ష్మణ్‌యాదవ్, కోరే అనిల్, గడీల నాగరాజు, రాచమల్ల వెంకన్న,శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మాతాశిశు సంరక్షణకు కృషి చేయాలి'

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 18 : మాతాశిశు సంరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని డీఎంఅండ్‌హెచ్‌వో బి.కళావతిబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో గురువారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12 వారాల్లోపు గర్భిణీల పేర్లను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. సాధారణ ప్రసవరాలు ఆరోగ్య కేంద్రాల్లోనే జరగాలని చెప్పారు. శస్త్రచికిత్సలను తగ్గించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంబరీష, మురళీధర్, నాగేశ్వర్‌రావు, సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, ప్రసాద్, కావెటి మంగమ్మ, రుక్మోద్దీన్, వసంత తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కళావతిబాయి

కురవి పీహెచ్‌సీని తనిఖీ..

కురవి : కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులు, లేబర్‌రూం, మందుల నిల్వగదిని పరిశీలించారు. అనంతరం వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, డీపీహెచ్ఎన్‌వో మంగమ్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విరాజిత పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంను కలిసిన సీపీఐ నాయకులు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : కేసముద్రం మండలం అర్పనపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని గురువారం సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి సలహాదారులుగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా మహబూబాబాద్ జిల్లాకు విచ్చేసిన వేం నరేందర్‌రెడ్డిని శాలువాలతో సత్కరించారు. తాను రచించి నిర్మించిన తెలంగాణ జాతి పోరు వీడియో ఆల్బమ్ ఆవిష్కరణకు రావాలని ఆహ్వానించినట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మానుకోట మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి తెలిపారు. జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుగుకుమార్, కేసముద్రం మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు రవీందర్ పాల్గొన్నారు.

అర్పనపల్లిలో..

- కేసముద్రం : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని స్వగ్రామమైన మండలంలోని అర్పనపల్లిలో గురువారం కాట్రపల్లి కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోతు దస్రునాయక్, సిరికొండ మల్లయ్య, బూర బిక్షపతి, జల్లె యాకాంబ్రం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మేడేను జరపాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : కేంద్రప్రభుత్వ కార్మిక విధానాలను నిరసిస్తూ మేడేను జరుపుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని గుణగంట్ల రాము అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక హక్కులను, చట్టాలను మార్చి వాటిస్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకురావడాన్ని వ్యతిరేకించాలని తెలిపారు. లెబర్‌కోడ్‌లు కార్మికులను కట్టుబానిసలుగా మార్చేవిగా ఉన్నాయని విమర్శించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ మేడేను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లాకార్యదర్శి తాగబోయిన శ్రీశైలం, కోటేశ్వర్‌రావు, ముల్కు మురళి, కారపాటి వెంకన్న, యాదగిరి, సైతులు, శైలం, రాజు, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : ఝాన్సీరెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 18 : కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి చెందుతుందని పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నుంచి రాయపర్తి, దేవరుప్పల మండలాల నుంచి 200 మంది కార్యకర్తలు ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా 5 గ్యారెంటీలు నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో అమలవుతున్నాయన్నారు. అన్ని గ్రామాలను అభివృద్ధిచేస్తానని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు,తాగునీటి సౌకర్యం, సాగునీరు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వంశీ, రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కర్రలకే విద్యుత్ తీగలు

- ఇబ్బందులు పడుతున్న రైతులు


గుండెపుడిలో కట్టెలకు విద్యుత్ తీగలు

మరిపెడ రూరల్, ఏప్రిల్ 18 : టెక్నాలజీ ఎంతో పెరిగినప్పటికీ ఇక్కడ మాత్రం కర్రలకే విద్యుత్ తీగలు అమర్చడం జరిగింది. దీంతో రైతాంగం సంవత్సర కాలం నుంచి కరెంట్ లైన్‌మెన్‌కి చెప్పినప్పటికీ ఫలితం శూన్యమని రైతులు గుండగాని లింగరాజ్, గణేష్, బర్మావత్ భద్రులు ఆరోపించారు. మరిపెడ మండలంలోని గుండెపుడిలో నూతన గ్రామ పంచాయతీ భవనం వద్ద నుంచి ట్రాన్స్‌ఫారం నుంచి గుండెపుడి గ్రామంలోకి విద్యుత్ లైన్‌ను తీశారన్నారు. అయితే రెండు స్తంభాలు వేయాల్సి ఉండగా ఒకటే స్థంబాన్ని వేసి చేతులు దులుపుకున్నారన్నారు. దీంతో తీగలు లూస్ అయ్యాయన్నారు. అటు వైపు వెళ్లిన మూగజీవాలు మృత్యువాతపడ్డాయన్నారు. దీంతో పలు మార్లు విద్యుత్ అధికారులకు వినతి పత్రాన్ని అందించినా పట్టించుకునే పాపాన పోలేదన్నారు. రైతులు పొలాలు దున్నేందుకు వెళతారని విద్యుత్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లోకి దాట్ల తాజా మాజీ సర్పంచ్

దంతాలపల్లి, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, దాట్ల హ్యాట్రిక్ సర్పంచ్, తాజామాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గత వారం నుంచి కొమ్మినేని రవీందర్‌కు కాంగ్రెస్ పార్టీ పిలుపు వస్తుండడంతో భారీస్థాయిలో మండలంలోని లక్ష్మీపురం, ఆగపేట, గున్నేపల్లి గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లతో కలిసి డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో పని చేస్తామన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, నాయకులు నూకల నరేష్‌రెడ్డి, కొత్త కొమురెల్లి, తదితరులు పాల్గొన్నారు.

'హస్తం' పార్టీలో చేరిన 9వ వార్డు కౌన్సిలర్


శ్రీపాల్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ, ఏప్రిల్ 18 : మరిపెడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీకి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ విసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి బుధవారం రాత్రిడోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఆ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆ వార్డుకు చెందిన అనేకమంది ప్రగతిశ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యాన బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వార్డు ప్రజల అభీష్టంతోనే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రగతిశ్రీపాల్ రెడ్డి విలేకరులకు తెలిపారు. అల్వాల ఉపేందర్, దూగుంట్ల వెంకన్న, భరత్, లక్ష్మీనారాయణ, కారంపూడి ఉపేందర్ ఉన్నారు.

'బంజారాలకు రాజకీయాలలో సముచిత స్థానం కల్పించాలి'

గార్ల ఏప్రిల్ 18 : జనాభా దామాషా ప్రకారం జాతీయ రాజకీయ పార్టీలు బంజారాలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలి ఇల్లందు ఏ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జర్పుల భీముడునాయక్ అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బంజారా బిడ్డలు అనేక ఉద్యోగాలల్లో ముందు వరుసలో ఉన్నారని, వీరికి మాత్రం రాజకీయ పదవుల విషయంలో అగ్రవర్ణాల ఆధిపత్యంలో బంజారా నాయకులను బలిపశువులుగా మారుస్తున్నారన్నారు. బంజారాలకు ఎస్టీ జాబితాలో చేర్చి కాంగ్రెస్ పార్టీ సమాజంలో మంచి గుర్తింపును తీసుక వచ్చిన ఆ పార్టీ రాజకీయంగా గుర్తింపును ఇవ్వకపోవడంతో అనేక మంది వివిధ పార్టీల్లో చేరి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బంజారా అభివృద్ధి పాటు పడిన కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చు కొనేందుకు ప్రతీ ఒక్క బంజార బిడ్డా కాంగ్రెస్‌కు మద్దతూ పలకాలన్నారు. మాజీ ఎంపీపీ బానోత్ అర్జునానాయక్ పాల్గొన్నారు.

పమిడి పడిగ రాజు జాతర పోస్టర్ ఆవిష్కరణ


వేలుబెల్లిలో వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న జాతర నిర్వాహకులు

కొత్తగూడ, ఏప్రిల్ 18 : మండలంలోని వేలుబెల్లిలో ఈనెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్న పమిడి పడిగరాజు, సడలమ్మ జాతర వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తలపతులు ధన్నసరి సారయ్య, మంకిడి లక్ష్మీపతి, ఆగబోయిన రవి, మంకిడి సతీష్, ఐలబోయిన లక్ష్మయ్య, వడ్డెలు దారం సమ్మయ్య, ధనసరి వెంకటేష్, ఐలబోయిన రమేష్, మనోజ్, సురేష్, రాకేష్, మోకాళ్ల జనార్ధన్‌లు పాల్గొన్నారు.

బుచ్చిరాములు మృతి కార్మికోద్యమానికి తీరనిలోటు

- ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సక్రు

గార్ల ఏప్రిల్ 18 : ఆటో యూనియన్ సమస్యలపై నిరంతరం పోరాటం సాగించే దబ్బెట బుచ్చిరాములు అకాల మరణం కార్మికోద్యమానికి తీరనిలోటని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు అన్నారు. గురువారం గార్ల మండలం సత్యనారాయణ పురం సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుచ్చిరాములు సంస్మరణ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామంలో వార్డు మెంబర్‌గా పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించంలో బుచ్చి రాములు చేసినసేవలు మరువలేమన్నారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోనగిరి మధు, పాలేపు నాగేశ్వరరావు, సుధాకర్, శ్రీను, కోమరయ్య మల్లికాంబ, శ్రీను పాల్గొన్నారు.

'మోదీ పథకాలతోనే అరూరి గెలుపు'

తొర్రూరు ఏప్రిల్ 18 : బీజేపీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా అరూరి రమేష్ గెలుపు ఖాయమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు కర్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, పథకాల ఫలితంగానే వరంగల్ ఎంపీగా ఆరూరి రమేష్ గెలుపు తథ్యమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రజలకు అమలు పరుచలేని హామీలు ఇచ్చి మోసం చేస్తున్నాయని విమర్శించారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొచ్చు సురేష్, కుమార్, పులేందర్, యాకన్న, రాంబాబు, శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ మానుకోట ఇన్‌చార్జ్‌గా శ్రీధర్



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : కాంగ్రెస్ ఎస్సీ సెల్ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా జిల్లా కేంద్రం శివారు గుమ్మనూర్‌కు చెందిన ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిప్పర్తి శ్రీధర్ నియామకమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలకు ఎస్సీ విభాగం ఇన్‌చార్జ్‌లను రాష్ట్ర నగరిగారి ప్రీతమ్ గురువారం ప్రకటించారు.అందులో భాగంగా మానుకోట పార్లమెంటరీనియోజకవర్గ ఇన్‌చార్జీగా శ్రీధర్ నియామకమాయ్యరు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తానని స్పష్టం చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 18 : మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా అధికారుల చుట్టు తిరుగుతున్నప్పటికి కార్మికులకు వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్మికులకు వేతనాలు విడుదల చేయడంతో పాటు వారికి సబ్బులు, కొబ్బరి నూనె లాంటి వస్తువులను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంగళంపల్లి నర్సింహా, వెంకన్న, ప్రసాద్, మహేందర్, ఉప్పలయ్య, లక్ష్మి, పైండ్ల యాకయ్య, మురళీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జిల్లా అధ్యక్షుడు రవి